సాక్షి
అనకాపల్లి

మంగళవారం । 18 । జూలై । 2023



గడువులోగా పరిష్కారం

కలెక్టరేట్ స్పందనకు 289 అర్జీలు వచ్చాయి. గడువులోగా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. IIలో



చేరువలో ఉన్నత విద్య..!

పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రతి మండలంలో రెండు ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేస్తోంది. IIలో



బోటు షికారు పునఃప్రారంభం

కొమ్మాది (విశాఖ): రుషికొండ బీచ్‌లో సోమవారం నుంచి బోటు షికారు పునః ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఉషు పోటీల్లో పతకాల పంట



క్రీడాకారులను అభినందిస్తున్న ఆర్డీవో హెచ్.వి.జయరాం

నర్సీపట్నం: రాష్ట్ర స్థాయి ఉషు పోటీల్లో నర్సీపట్నానికి చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. శ్రీకాకుళం జిల్లాలో ఈనెల 15, 16 తేదీల్లో రాష్ట్ర స్థాయి వూషు చాంపియన్‌షిప్ జరిగింది. నర్సీపట్నం నింజాస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు పాల్గొని, ఏడు బంగారు, 3 రజత, ఒక కాంస్య పతకాలు సాధించారు. వీరిని ఆర్డీవో హెచ్.వి.జయరాం అభినందించారు. ఈ పోటీల్లో కె.జాహ్నవి, జి.జ్యోతి, కె.శరణ్య, పి.లేఖ్య, నవదీప్, లోకేష్, బబ్బులు, రాజమౌళి, హేమసాయి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, కోచ్‌లను ఆర్డీవో ప్రశంసించారు.

పండంటి బిడ్డకు జన్మనిచ్చిన రమ్య



బిడ్డతో తల్లి రమ్య

కోటవురట్ల: డోలీ మోతతో ఆస్పత్రిలో చేరిన గిరిజన మహిళ కథ సుఖాంతమైంది. పండంటి బిడ్డకు జన్మనివ్వడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తల్లీ బిడ్డా క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామానికి చెందిన తాంబెళ్ల రమ్య అనే గర్భిణికి నెలలు నిండి ఆదివారం పురిటినొప్పులు రావడంతో ఆందోళన చెందిన గిరిజనులు హుటాహుటిన డోలీలో మోసుకెళ్లి కోటవురట్ల ఆస్పత్రిలో చేర్చిన సంగతి తెలిసిందే. సోమవారం తెల్లవారుజామున రమ్య ప్రసవించి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. రమ్యకు రక్తం తక్కువగా ఉండడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. రమ్య, సూరిబాబు దంపతులకు ఇప్పటికే ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

చౌడేశ్వరి శూలాల ఉత్సవం



శూలాలు ధరించి ఊరేగింపుగా వెళుతున్న చౌడేశ్వరి భక్తులు

కశింకోట: స్థానిక కస్పావీధిలో సోమవారం రాత్రి చౌడేశ్వరి అమ్మవారి శూలాల మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారి ఆలయం నుంచి భక్తులు గంప శూలం, సాంబ శివుని శూలం, బుగ్గ శూలాలు వగైరా ధరించి ప్రభలు, డప్పులు, వాయిద్యాలు, మహిళల కోలాటాలతో బాణసంచా వెలుగుల్లో ఊరేగింపు సాగింది. అక్కడి నుంచి పెద బజారు, డీఎంఎస్ హైస్కూల్, పాల కేంద్రం, ఉప్పునీటి దిబ్బ, ద్వారపురెడ్డి వారి వీధి మీదుగా ఊరేగింపు నిర్వహించి, తిరిగి ఆలయానికి చేరుకుంది. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ ఉత్సవానికి హాజరై అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఉత్సవంలో శూల ధారులకు ప్రజలు దారి పొడవునా పూజలు చేశారు. ఉత్సవాన్ని భక్తి పారవశ్యంతో తిలకించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి. దేవాంగ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ రికార్డు ఉత్పత్తి




స్ట్రక్చరల్ మిల్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ విభాగం (ఎస్టీఎం) ఈనెల 15న రికార్డు ఉత్పత్తి సాధించింది. ఈ విభాగంలో తయారయ్యే 50/50/6 ఏంగిల్‌ను ఆ రోజు అత్యధికంగా 2,267 టన్నులు ఉత్పత్తి చేశారు. ఈ ఏడాది మే 8న అత్యధికంగా 2173 టన్నులు ఉత్పత్తి చేయగా ఇప్పుడు ఆ రికార్డును అధిగమించారు. రికార్డు ఉత్పత్తి సాధించిన ఎస్టీఎం విభాగం ఉద్యోగులను స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి కోయిలాడ శ్రీనివాసరావు అభినందించారు.

బుద్ధం దర్శనం గచ్ఛామి

బుద్ధుడు నడయాడిన నేల మనది. వాటి ఆనవాళ్లు.. ఆరామాల రూపంలో ఆధ్యాత్మికతను చాటిచెప్తున్నాయి. జిల్లాలోని బొజ్జన్నకొండ ప్రసిద్ధి చెందిన బౌద్ధారామాల్లో ఒకటి. స్వదేశ్ దర్శన్ పథకంలో దీని అభివృద్ధికి కేంద్రం నిధులిచ్చినా.. గత టీడీపీ ప్రభుత్వ నిర్లిప్తతతో నిధులు వెనక్కిమళ్లాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంపీ సత్యవతి చొరవతో నిధుల పునఃకేటాయింపు జరిగింది. డిసెంబర్ నాటికి పర్యాటకపరంగా దీన్ని అభివృద్ధి చేసేందుకు యంత్రాంగం సమాయత్తమయింది.



- స్వదేశ్ దర్శన్ స్కీంలో బొజ్జన్నకొండ అభివృద్ధి
- రూ.7.30 కోట్లు మంజూరు చేసిన కేంద్ర పర్యాటక శాఖ
- మౌలిక వసతులు, ధ్యాన బుద్ధ పార్క్ అభివృద్ధికి చర్యలు



బొజ్జన్నకొండ అభివృద్ధి గురించి అధికారులతో చర్చిస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: ప్రాచీన బౌద్ధారామాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. స్వదేశ్ దర్శన్ పథకంలో భాగంగా బుద్ధిస్ట్ సర్క్యూట్ల అభివృద్ధికి కేంద్ర పర్యాటకశాఖ రెండో విడతలో తాజాగా నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని బొజ్జన్నకొండ తోపాటు విశాఖలోని తొట్ల(బావి)కొండ, శ్రీకాకుళంలోని శాలిహుండం, పల్నాడులోని అమరావతి తదితర బౌద్ధారామాలున్నాయి. వీటి అభివృద్ధికి కేంద్రం రూ.52.33 కోట్లు కేటాయించగా, తొలివిడతగా 2017లో రూ.26.16 కోట్లు విడుదల చేసింది. రెండో విడతలో భాగంగా జూలై 3న మరో రూ.24.13 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతలో నిధులు పొందిన బావికొండ(రూ.13.41 కోట్లు), తొట్లకొండ(రూ.2.60 కోట్లు), శాలిహుండం(రూ.2.27 కోట్లు) పనులు తుదిదశకు చేరుకున్నాయి.

ఎంపీ సత్యవతి చొరవతో నిధులు

స్వదేశ్ దర్శన్ స్కీంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2017లో ఏపీలోని పలు పర్యాటక బౌద్ధారామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. అప్పటి నుంచి 2019 వరకూ రెండు విడతల్లో బౌద్ధ సర్క్యూట్లకు నిధులిచ్చింది. విశాఖలో బావికొండ, తొట్లకొండల అభివృద్ధి జరిగినా.. అనకాపల్లి శంకరం గ్రామంలోని బొజ్జన్నకొండకు అప్పటి టీడీపీ ప్రభుత్వం స్థలం చూపించకపోవడంతో నిధులు వెనక్కిపోయాయి. దీంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి పలుమార్లు కేంద్ర టూరిజం మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడి బొజ్జన్నకొండకు నిధులు పునఃవిడుదలయ్యేందుకు కృషి చేశారు. ఆమె చొరవ తీసుకుని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి 1.4 ఎకరాల స్థలాన్ని బొజ్జన్నకొండ అభివృద్ధికి కేటాయించేలా చేశారు. దీంతో ఈ నెల తొలి వారంలో కేంద్ర పర్యాటక శాఖ బొజ్జన్నకొండ అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది.

స్వదేశ్ దర్శన్ పథకం

2014–15లో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. ప్రాచీన బౌద్ధారామాలు, బౌద్ధ ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, ప్రాచీన బౌద్ధమతాన్ని బుద్ధిస్ట్ సర్క్యూట్లుగా అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ టూరిస్ట్ సర్క్యూట్‌లను అధిక పర్యాటక విలువ, పోటీతత్వం, సుస్థిరత అనే సూత్రాలపై సమగ్ర పద్ధతిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 15 సర్క్యూట్‌లను గుర్తించారు. సర్క్యూట్‌ల వారీగా బౌద్ధారామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి కేంద్ర పర్యాటక శాఖ కృషి చేయనుంది.

బొజ్జన్నకొండకు రూ.7.32 కోట్లు

బొజ్జన్నకొండ అభివృద్ధికి మొత్తం రూ.7.32 కోట్లు మంజూరు చేశారు. టూరిస్ట్ ఎమినిటీ పార్కింగ్, బుద్ధిస్ట్ కల్చరల్ సెంటర్(రెస్టారెంట్, క్లాక్‌రూం, మెడిటేషన్, పార్కింగ్ సదుపాయం) అభివృద్ధికి రూ.37.44 లక్షలు కేటాయించారు. టూరిస్ట్ ఎమినిటీ సెంటర్ ఏర్పాటుకు రూ.1.83 కోట్లు, ఫౌంటైన్ లైటింగ్‌కు రూ.28 లక్షలు, బుద్ధిస్ట్ తోరణం ఏర్పాటుకు రూ.7.34 లక్షలు, లైట్స్ అండ్ సౌండ్స్‌కు రూ.4.72 లక్షలు, సీసీటీవీ ఏర్పాటుకు రూ. 2.32 లక్షలు, వైఫై సదుపాయానికి రూ. 2.50 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు పనులు చేపట్టనున్నారు.

డిసెంబర్ నాటికి పనులు పూర్తి



స్వదేశ్ దర్శన్ పథకంలో 15 రాష్ట్రాల్లోని 30 నగరాలను సంపూర్ణ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం ఎంపిక చేసింది. అందులో భాగంగానే ఏపీలో బౌద్ధారామాల అభివృద్ధికి విడతల వారీగా నిధులు మంజూరు చేశారు. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిబంధల మేరకు బొజ్జన్నకొండ సమీపంలో 200 మీటర్ల లోపల నిర్మాణాలు చేపట్టరాదు. దీంతో బొజ్జన్నకొండకు సమీపంలో ఇరిగేషన్ శాఖకు చెందిన ప్రభుత్వ స్థలం 1.4 ఎకరాలను అనకాపల్లి ఎంపీ సత్యవతి చొరవతో ఏపీ ప్రభుత్వం పర్యాటకశాఖకు అప్పగించింది. ఆగస్టులో పనులు ప్రారంభించి డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం.

– వెంకటరమణ, ఈఈ, పర్యాటకశాఖ

సుపరిపాలనలో మరో ముందడుగు

- ప్రతి సోమవారం నియోజకవర్గ సమీక్షలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాజన్నదొర, పక్కనడిప్యూటీ సీఎం బూడి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా సుపరిపాలన కోసం ప్రతి సోమవారం ఒక్కో నియోజకవర్గంలో సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. కలెక్టర్ కార్యాయంలో సోమవారం నిర్వహించిన మాడుగుల నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గాల అభివృద్ధి కమిటీ సమావేశాలకు నాంది పలికినట్లు పేర్కొన్నారు. మొట్టమొదటిగా జిల్లాలో మాడుగుల నియోజకవర్గం అభివృద్ధిపై ప్రభుత్వం ఆలోచనా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు చేపట్టనున్నామన్నారు. నియోజకవర్గాలను ఉత్తమ స్థానాల్లో నిలిపేలా అధికారులు చొరవ చూపాలన్నారు. నియోజకవర్గంలో బృహత్తర కార్యక్రమాల అభివృద్ధికి నివేదికలు పంపిన వెంటనే ప్రాధాన్యత క్రమంలో సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గాల్లో సమస్యలను తమ వద్దకు తీసుకువస్తే, సాధ్యమైనంత మేరకు వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులకు తెలిపారు. ముఖ్యంగా రహదారుల మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ వడ్డాది-మాడుగుల, వడ్డాది-పాడేరు రోడ్లను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మాడుగుల నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సదుపాయాలు లేని వాటిని గుర్తించి వాటికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. నూతన భవనాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ విశాఖపట్నం నుంచి ఇరిగేషన్ డివిజన్ కార్యాలయాన్ని నర్సీపట్నానికి తరలిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. తక్షణమే ఇరిగేషన్ కార్యాలయాన్ని నర్సీపట్నంలో ఏర్పాటు చేసి, అక్కడి నుంచే విధులు నిర్వహించాలని ఇరిగేషన్ అధికారులను సూచించారు. రిజర్వాయర్‌లకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వినియోగంపై తక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జేసీ ఎం.జాహ్నవి, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై పెరుగుతున్న ఆసక్తి

- యూరియాకి బదులు దమ్ములో ఘన జీవామృతం వేయాలి
- జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి లచ్చన్న



రైతులతో మాట్లాడుతున్న జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి లచ్చన్న

నాతవరం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారని.. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి లచ్చన్న అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులంతా యూరియాకి బదులుగా దమ్ములో ఘన జీవామృతం వేయాలని ఆయన సూచించారు. సోమవారం ఎస్.బి.పట్నం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి లచ్చన్న, ఎంటీ గోవిందులు ఫీల్డ్ విజిట్ చేసి ప్రకృతి వ్యవసాయంలో లాభాలు వివరించారు. యూరియాకి బదులుగా దమ్ములో ఘన జీవామృతం వేయడం వల్ల ప్రయోజనాలు వివరించారు. నీమాస్త్రం స్ప్రే చేయడం వల్ల వచ్చే లాభాలను వివరించి ప్రకృతి వ్యవసాయం చేసే రైతులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

వారాహిపై కాదు వీధుల్లో తిరగండి



పవన్ ఫొటోలను దహనం చేస్తున్న వలంటీర్లు

- అప్పుడే మా సేవలేమిటో తెలుస్తాయి
- పవన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న వలంటీర్లు



మానవహారంగా ఏర్పడ్డ వలంటీర్లు

మాకవరపాలెం: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్లు ఆందోళన చేపట్టారు. వివిధ గ్రామాలకు చెందిన వలంటీర్లు సోమవారం స్థానిక సచివాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద వారంతా మానవహారంగా ఏర్పడి పవన్ కల్యాణ్ వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వారాహిపై తిరగడం కాదని, వీధుల్లో తిరిగితే తమ సేవలు తెలుస్తాయన్నారు. అనంతరం నర్సీపట్నం–విశాఖపట్నం ప్రధాన రహదారిలో పవన్ ఫొటోలను చెప్పులతో కొట్టి దహనం చేశారు.

కేజీహెచ్‌కు 'ఆరోగ్య' సిరి

- ఆరోగ్యశ్రీలో వేల చికిత్సలు
- జూన్‌లో రూ.4 కోట్ల ఆదాయం



మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్ ఆర్థికంగా మెరుగుపడుతోంది. ఆరోగ్యశ్రీలో క్యాన్సర్, గుండె జబ్బులకు మెరుగైన వైద్యం అందిస్తుండడం వరంగా మారింది. క్యాన్సర్, గుండెజబ్బులు, డెంగ్యు, మలేరియా, చికున్ గున్యాతోపాటు సుమారు 2 వేలకు పైగా జబ్బులను ఆరోగ్యశ్రీలో ప్రభుత్వం చేర్చింది. ఈ అవకాశాన్ని కేజీహెచ్ అందిపుచ్చుకుంది. ఇంతవరకు ప్రైవేటు ఆస్పత్రుల్లోనే ఆరోగ్యశ్రీకి మెరుగైన వైద్యం అందేది. ఇప్పుడు కేజీహెచ్ కూడా ఆ జాబితాలో చేరింది. అధునాతన వైద్య పరికరాలను ప్రభుత్వం అందించడంతో కీలకమైన ఆపరేషన్లు ఇక్కడే నిర్వహిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో జూన్ నెలలో వివిధ వైద్య సేవలు అందించినందుకు గానూ రూ.4 కోట్ల ఆదాయం లభించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక నెలలో ఇంత ఆదాయం సమకూరడం ఓ రికార్డు.

కేసుల వివరాలు

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా జూన్‌లో 2,460 మందికి చికిత్సలు అందించారు. దీని ద్వారా రూ.4 కోట్ల ఆదాయం లభించింది. మేలో 2,300 కేసులకు రూ.40 లక్షలు, ఏప్రిల్‌లో 2,200 కేసుల ద్వారా రూ.38 లక్షలు, మార్చిలో 2,300 కేసుల ద్వారా రూ.45 లక్షల ఆదాయం సమకూరింది.

ఆరోగ్యశ్రీలో చికిత్సలు.. సమకూరిన ఆదాయం

మార్చిలో మొత్తం కేసులు	: 2,300
వచ్చిన ఆదాయం	: రూ.45 లక్షలు
ఏప్రిల్‌లో	: 2,200 కేసులు
ఆదాయం	: రూ.38 లక్షలు
మేలో	: 2,300 కేసులు
ఆదాయం	: రూ.40 లక్షలు
జూన్‌లో	: 2,460 కేసులు
ఆదాయం	: రూ. 4 కోట్లు



ఆరోగ్యశ్రీలో పేదలకు వైద్యం



పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ ఆశయాన్ని ముందుకు నడిపించేందుకు కృషి చేస్తున్నాం. ఇటీవల కాలంలో ఆరోగ్యశ్రీ పరిధిలో శస్త్ర చికిత్సలు ఎక్కువ చేశాం. దీని ద్వారా అధిక ఆదాయం సమకూరింది. పేదలకు మెరుగైన వైద్యం అందుతోంది. మంగళవారం ఆస్పత్రిలో అన్ని వైద్య విభాగాధిపతులతో సమావేశం ఏర్పాటు చేశాను.

– డాక్టర్ పి.శివానంద్, కేజీహెచ్ సూపరింటెండెంట్, విశాఖపట్నం

సెంచరీ దాటినా చలాకీగా..!

రోజూ రెండు మూడు గంటల నడక.. వ్యాయామం.. ఎనిమిది గంటల నిద్ర.. ఒంటిపూట భోజనం.. మితాహారం.. ఇదంతా దాదాపు యాభై ఏళ్ల నుంచి అలవాటు చేసుకున్నారాయన! ఇప్పుడాయనకు వందేళ్లు దాటాయి. అయినా.. ఇప్పటికీ నడక మానలేదు. వ్యాయామం ఆపలేదు. సంపూర్ణ ఆరోగ్యంతో రోజుకి 12 కిలోమీటర్లు నడుస్తున్నారు. మంగళవారం 101 ఏట అడుగు పెడుతున్న ఆయన పేరు వి.శ్రీరాములు. ఊరు మచిలీపట్నం. స్థిరపడింది విశాఖపట్నం.

- నిత్యం రోజూ 12 కి.మీ. నడక.. వెయిట్ లిఫ్టింగ్
- జీవితంలో ఒక్క రోజూ ఆస్పత్రి మెట్లెక్కని వైనం
- దేశంలో రిటైర్డ్ నేవీ ఉద్యోగుల్లో శతాధిక వృద్ధుడు శ్రీరాములు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వందల్లో పతకాలు
- నేడు 101వ వసంతంలోకి అడుగుపెట్టనున్న శ్రీరాములు



సాధించిన పతకాలను చూపిస్తూ..

సాక్షి, విశాఖపట్నం: అరవై డబ్బై ఏళ్లకే జీవితం అయిపోయిందనుకుంటూ నిట్టూరుస్తున్న రోజులివి. కానీ.. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన వి.శ్రీరాములు అలా అనుకోవడం లేదు. వయసు నూరేళ్లు దాటినా.. ఇంకా విదేశాల్లో జరిగే అథ్లెటిక్ పోటీలకు సన్నద్ధమవుతున్నారు. 1923 జూలై 18న దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన ఆయన తన 21వ ఏట (27 మార్చి 1944లో) అప్పటి రాయల్ ఇండియన్ నేవీలో చీఫ్ పెట్టీ ఆఫీసర్‌గా చేరారు. 1979 డిసెంబర్ 31న కమాండర్ హోదాలో పదవీ విరమణ చేసి విశాఖలో స్థిరపడ్డారు. ఆపై ఆరోగ్యాన్నిచ్చే నడకను అలవాటు చేసుకున్నారు. ఆ తర్వాత రేస్ వాకింగ్‌తో పాటు రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి ఆటల్లోనూ సత్తా చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో లెక్కకు మిక్కిలి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. ఏసియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 5, 10, 20 కి.మీ. రేస్ వాకింగ్ పోటీల్లో 9 బంగారు, 5 రజత, 2 కాంస్య పతకాలు, వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో 5 బంగారు, 3 రజత పతకాలను కైవసం చేసుకున్నారు. వెటరన్స్ (మాస్టర్స్) కేటగిరీలో ఇప్పటికీ ప్రపంచస్థాయి పోటీల్లో పాల్గొంటూ బంగారు, రజత, కాంస్య పతకాలను సాధిస్తూనే ఉన్నారు. అంతేనా? పర్వతారోహణంపైనా మక్కువ ఉన్న శ్రీరాములు 79వ ఏట తన కుమారుడు సాగర్‌తో కలిసి 2002లో ఆఫ్రికాలోని కిలీమాంజారో, 81వ ఏట 2004లో ఎవరెస్ట్ బేస్ క్యాంపు, 83వ ఏట హిమాలయాల్లోని పిండారీ గ్లేసియర్‌లను అధిరోహించారు.

ఇంకా అంతర్జాతీయ పోటీలకు సై..

శ్రీరాములు 101వ ఏట ఈ ఏడాది నవంబరు 8–12 వరకు ఫిలిప్పీన్స్‌లో జరిగే ఏసియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ కాంపిటిషన్స్‌లో, వచ్చే ఏడాది జూన్‌లో స్వీడన్‌లో నిర్వహించే వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు సిద్ధమవుతున్నారు. శ్రీరాములుది విభిన్న జీవనశైలి. మితంగా తింటారు. ఉదయం మొలకల చట్నీతో ఒక బ్రెడ్ టోస్ట్, కాఫీ లేదా మజ్జిగ తీసుకుంటారు. మధ్యాహ్నం పెరుగన్నమే తింటారు. అందులో కూరలు నంజుకుంటారు. సాయంత్రం కప్పు మజ్జిగ లేదా అరటిపండు తీసుకుంటారు. రాత్రికి ఏమీ తినకుండా 7.30కే నిద్రకు ఉపక్రమిస్తారు. మర్నాడు తెల్లవారుజామున 3.15కి లేచి మార్నింగ్ వాక్ చేస్తారు. వందేళ్ల ప్రాయంలో ఆయన పుస్తకాలు బాగా చదువుతారు. పిల్లలు స్థిరపడటంతో సతీమణితో కలిసి విశాఖలో ఉంటున్నారు.

నేడు శతాధిక సంబరాలు

శ్రీరాములు 101 ఏటలోకి అడుగిడుతున్న సందర్భంగా విశాఖ బీచ్‌లో సాటి వాకర్ స్నేహితులు మంగళవారం ఉదయం ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించనున్నారు. మరో విశేషం ఏమంటే.. దేశంలో నేవీలో పనిచేసి వందేళ్లకు పైగా జీవించి ఉన్న ఏకైక అథ్లెట్ శ్రీరాములే కావడం విశేషం.



నేవీ ఉద్యోగిగా ఆనాటి శ్రీరాములు



విశాఖ బీచ్‌రోడ్డులో వాకింగ్ చేస్తున్న శ్రీరాములు

హ్యాపీగా జీవించడమే లక్ష్యం..

నాకేమీ లక్ష్యాలు లేవు. ఉన్నదల్లా ఉన్నన్నాళ్లూ హ్యాపీగా జీవించడమే. నేను ఇప్పటివరకు ఆస్పత్రి మెట్లెక్కలేదు. రక్తపోటు, మధుమేహం సహా ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. ఆఖరి ఘడియల్లోనూ ఆస్పత్రికి వెళ్లకూడదన్నది నా ఆశ. క్రమశిక్షణతో కూడిన జీవితం ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. తక్కువ తిని, ఎక్కువ వ్యాయామం చేయాలని ఈ తరం వారికి నేనిచ్చే సలహా. నా ఆరోగ్య రహస్యం కూడా అదే. త్వరలో జరిగే అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని మెడల్స్ సాధిస్తానన్న నమ్మకం ఉంది.

– వి.శ్రీరాములు, శతాధిక అథ్లెట్

క్లుప్తంగా

జగన్ వీరాభిమాని బైక్ యాత్ర

రాజు సంకల్పం నెరవేరాలని మంత్రి అమర్‌నాథ్ ఆశీస్సులు



అనకాపల్లి టౌన్: ప్రస్తుత సీఎం జగన్‌మోహన్ రెడ్డి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ అధికారం దక్కించుకోవాలని కోరుతూ జగన్ వీరాభిమాని పాస్టర్ అడవికొట్టు రాజు చేపట్టిన బైక్ యాత్రకు స్థానిక వైఎస్సార్‌సీపీ శ్రేణుల నుంచి సోమవారం ఘన స్వాగతం లభించింది. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో మే 15వ తేదీన తన బైక్ యాత్ర ప్రారంభించాడు. ఇందులో భాగంగా అనకాపల్లి మండలం సీహెచ్ఎన్ అగ్రహారం చేరుకున్నాడు. ఇక్కడ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిశాడు. జగన్మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలన్న రాజు సంకల్పం నెరవేరాలని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. సదరు వ్యక్తి బైక్ యాత్ర పెందుర్తి నియోజకవర్గం సబ్బవరం చేరుకుంది.

అర్జీలకు గడువులోగా పరిష్కారం

- అప్పుడే స్పందనపై ప్రజలకు నమ్మకం
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- స్పందనకు 289 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో పనిచేసి స్పందన కార్యక్రమంపై బలమైన నమ్మకాన్ని అర్జీదారులకు కలిగించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయనతోపాటు జేసీ ఎం.జాహ్నవి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వీటి పరిష్కారంలో ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. పనితీరులో కాలయాపన చేయడం, అవకతవకలకు పాల్పడినట్టు తన దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా, నిర్దేశించిన గడువులోగా పరిష్కారం కాకపోతే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అందిన దరఖాస్తులకు నిర్ణీత గడువు, రీ ఓపెన్ దరఖాస్తులు, అస్పష్టమైన పరిష్కార నివేదికలపై ఆరా తీశారు. స్పందన వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదన్నారు. క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారులు దృష్టి పెట్టి చర్యలు చేపట్టాలన్నారు. డివిజనల్ అధికారులు అర్జీలపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌరసరఫరాల సేవలు, నవరత్నాలు, పేదలందరికీ ఇల్లు పథకం కింద పట్టాల పంపిణీ, సర్వే, ఉపాధి అవకాశాలు, భూవివాదాలు వంటి అనేక సమస్యలపై మొత్తం 289 అర్జీలు నమోదయ్యాయి. డీఆర్వో వెంకటరమణ, డీఆర్‌డీఏ పీడీ ఏ.లక్ష్మీపతి, డ్వామా పీడీ సందీప్‌కుమార్ అర్జీల స్వీకరణ చేపట్టారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొనగా, కలెక్టరేట్ బయట చేపట్టే నిరసనలు, ధర్నాలు తీవ్రతరం కాకుండా రూరల్ ఎస్సై నరసింహారావు బందోబస్తు నిర్వహించారు.

- రైవాడ రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువ నుంచి చోడవరం మండలంలో ఏడు గ్రామాలకు సాగునీరు అందించాలని కోరుతూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పలు గ్రామాల రైతులు నిరసన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.
- జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో మరణించిన, రిటైర్‌మెంట్, దీర్ఘకాలిక అనారోగ్యంతో ఖాళీగా ఏర్పడిన పోస్టులను వారి వారసులకు భర్తీ చేయాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నిరసన చేపట్టింది. జీవీఎంసీలో 480 పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించి అధికారులు కాలయాపన చేస్తున్నారని, తక్షణమే భర్తీ చేయాలని యూనియన్ అధ్యక్షుడు గంటా శ్రీరామ్ వినతిపత్రం అందించారు.
- ఆన్‌లైన్ బెట్టింగ్, లివింగ్ ఫ్రెండ్‌షిప్, వంటి వివిధ యాప్స్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు, వియ్యపు రాజు స్పందనలో కోరారు.

ఎస్పీ స్పందనకు 40 అర్జీలు

అనకాపల్లి టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 40 అర్జీలు వచ్చాయి. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటూ ఫిర్యాదులు స్వీకరించారు. చట్ట పరిధిలో వాటికి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, చీటింగ్ వంటి సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 14, 15 ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లిస్తున్నారని, అవి ఏమయ్యాయో కనిపెట్టాలని ఏపీ సర్పంచ్‌ల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మీ ముత్యాలరావు ఎస్పీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన)బి. విజయభాస్కర్, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం కేసులో ఒకరికి రిమాండ్

అనకాపల్లిటౌన్: మండలంలో గొలగాం పంచాయతీ కేటీపీ పాలెం గ్రామానికి చెందిన వ్యక్తి ఇటీవల శిలాఫలకాన్ని ధ్వంసం చేసినందుకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు గ్రామీణ ఎస్ఐ నర్సింగరావు సోమవారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఈనెల 6వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం జరిగిన కొద్దిసేపటికే కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకం ధ్వంసం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు. దర్యాప్తులో భాగంగా టి.అర్జున అనే వ్యక్తిని విజయవాడలో అరెస్టు చేసి స్థానిక 13వ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ చెప్పారు.

అక్రమ మద్యంతో ఇద్దరి అరెస్టు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం ఎస్ఈజెడ్ పరిధిలోని గురజాపాలెం శివాలయం వద్ద 71 మద్యం బాటిళ్లతో ఒకరిని, 20 మద్యం బాటిళ్లు కలిగి ఉన్న మరొకరిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. సోమవారం వీరిని అదుపులోకి తీసుకొని మద్యం స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

లారీ ఢీకొట్టి ఒకరు మృతి... ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామిరెడ్డి

రంపచోడవరం: రంపచోడవరం సమీపంలోని పెద్దగెద్దాడ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పెద్దగెద్దాడ శివారులో రెండు ద్విచక్ర వాహనాలను లారీ ఢీకొనడంతో పెదపాడు గ్రామానికి చెందిన ఎర్రగొండ రాజబాబు, కత్తుల రవితేజ రెడ్డి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదానికి కారణమైన లారీని రంపచోడవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంలో కోండ్ల అచ్యుతరామిరెడ్డి (25) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు దేవీపట్నం మండలం మంటూరు గ్రామానికి చెందిన వాడు. మారేడుమిల్లి మండలం రామన్నవలస గ్రామానికి చెందిన చదల బేబీ కుమారిని నాలుగు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. సోమవారం భార్య ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

దీక్ష విరమించండి...సమస్యలు తీరుస్తా...

గిరిజనులను ఎమ్మెల్యే గొల్ల బాబూరావు భరోసా



గిరిజనులకు లెటర్ చూపించి దీక్ష విరమించాలని కోరుతున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: 'దీక్ష విరమించండి.. నాపై నమ్మకం ఉంచండి.. మీ ఊరికి రోడ్డు వేయిస్తా..బడి కూడా ఏర్పాటు చేయిస్తా' అంటూ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గిరిజనులను భరోసా ఇచ్చారు. తమ గ్రామానికి రోడ్డు వేయాలని, పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో వారు 11 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాబూరావు సోమవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. 'పనులు మానుకుని, ఆహారం లేకుండా ఎన్నాళ్లు ఇలా.. నా మాట విని దీక్ష విరమించండి.. మీ సమస్యలు పరిష్కరిస్తా. కలెక్టర్‌కు లెటర్ రాశా' అని చూపించారు. '2008-09లో ఆనాటి ఎమ్మెల్యేగా మీ ఊరికి రోడ్డు వేయించాను. పెద్ద తుపాను రావడంతో ఎగువ నీటి ఉధృతికి కొట్టుకుపోయింది' అని గుర్తు చేశారు. మళ్లీ రోడ్డు వేయిస్తాను, దీక్ష విరమించండి అంటూ సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్ష విరమించబోమని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, సీపీఎం నేత జి.డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

సారాతో ఒకరి అరెస్టు

మాడుగుల: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఎస్ఐ తన సిబ్బందితో సోమవారం సారాపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎం.గదబూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మూడు లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డారు. అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి తెలిపారు.

గ్రామ సచివాలయ వ్యవస్థతో అన్ని సేవలు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



జె.డి.పేటలో నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రతి గ్రామంలో అన్ని రకాల సేవలను ప్రజలు ముంగిటకే అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని జె.డి.పేటలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ప్రతి పనికి మండల కేంద్రాల చుట్టూ తిరిగేవారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి స్థానికంగానే అన్ని రకాలు సేవలు అందిస్తున్నామన్నారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రజలకు కావల్సిన అవసరాలను తీర్చుతున్నామన్నారు. అనంతరం గ్రామంలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం పక్కా భవనాన్ని ప్రారంభించారు. ఎంపీపీ వేమరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, సర్పంచ్ కోశిరెడ్డి కృష్ణమూర్తి, మండల సచివాలయాల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితో ప్రజల జీవనంలో మార్పు



గోపాలపురం గ్రామంలో సచివాలయ శిలాఫలకాన్ని ప్రారంభించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే ప్రజల జీవన విధానంలో మార్పులు సాధ్యమవుతాయని పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని గోపాలపురంలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.25 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయాల వ్యవస్థ ద్వారా పరిష్కారమవుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రతి సమస్యకూ పట్టణానికి వెళ్లి అక్కడ అధికారులకు మొరపెట్టుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని వాపోయారు. నేటి పాలనలో ప్రభుత్వాధికారులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయాలకు వచ్చి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే, మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, వార్డు మెంబర్లు శానాపతి మాధవనాయుడు, సలాది సత్యారావు, జెర్రిపోతుల శంకర్, గొర్లి రమణ అప్పారావు, వైఎస్సార్‌సీపీ నేత కరణం సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాల పంట

జాతీయ స్థాయి పోటీలకు చోడవరం, అనకాపల్లి క్రీడాకారులు ఎంపిక



తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన చోడవరం, అనకాపల్లి క్రీడాకారులు

చోడవరం: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో చోడవరం, అనకాపల్లి విద్యార్థులు పతకాల పంట పండించారు. బంగారు పతకంతోపాటు 9 వెండి, ఒక కాంస్యం సాధించారు. ఇటీవల విజయనగరంలో కాడెట్ క్యోరుగి, పూమ్సే విభాగాల్లో ఈ పోటీల్లో జరిగాయి. క్యోరుగి పోటీల్లో 75 కేజీల విభాగంలో అనకాపల్లికి చెందిన డీఎస్ఎస్ అంజని ప్రియ బంగారు పతకం సాధించింది. బాలుర జట్టు విభాగం పూమ్సే పోటీల్లో చోడవరానికి చెందిన బొబ్బిలి సత్యరామచంద్ర, గండి కారుణ్య సందీప్, సోనారి ప్రియ వెండి పతకాలు సాధించారు. వ్యక్తిగత విభాగం పూమ్సే పోటీలో గండి కారుణ్య సందీప్, ఫెయిర్ పూమ్‌సేలో బి. దినేష్, డీఎస్ఎస్ అంజనిప్రియ వెండి పతకాలు సాధించారు. అండర్ 45 కేజీల విభాగం క్యోరుగి పోటీలో జీవీఎస్ వర్ధన్ కాంస్య పతకాన్ని సాధించాడు. వీరంతా రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ సోమవారం తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వీరిని అసోసియేషన్‌తోపాటు స్థానికులు అభినందించారు.

గాదిరాయిలో భారీగా అక్రమ మద్యం స్వాధీనం



మాడుగుల పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు



విలేకరులతో మాట్లాడుతున్న కె.కోటపాడు రూరల్ సీఐ తాతారావు, స్థానిక ఎస్ఐ దామోదర్‌నాయుడు

మాడుగుల రూరల్: గాదిరాయిలో ఒక కల్లం పాకలో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ మద్యంను స్థానిక ఎస్ఐ పి. దామోదర్‌నాయుడు సోమవారం పట్టుకున్నారు. ఈ కేసులో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు కె.కోటపాడు రూరల్ సీఐ కె.తాతారావు, స్థానిక ఎస్ఐ పి. దామోదర్‌నాయుడు సోమవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. గాదిరాయి గ్రామానికి చెందిన పడాల నాగేశ్వరావు కల్లం పాకల వద్ద ఒడిశా నుంచి తీసుకువచ్చిన 220 మద్యం బాక్స్‌లను అక్రమంగా నిల్వ చేశారు. ఒక్కో బాక్స్‌లో 48 సీసాలు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకుని నిందితులు పడాల నాగేశ్వరావు, సుంకర సింహాచలంనాయుడు, శానాపతి సత్యం అప్పారావు, పడాల మహలక్ష్మినాయుడు, ఎస్.కొండన్న, మెల్లి శ్రీనులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. ఈ మద్యం విలువ సుమారు రూ.14 లక్షలు ఉంటుందని తెలిపారు.

జీవన నైపుణ్యాల పెంపుతో విజయం

ఆధునిక నైపుణ్యాలపై టీచర్లకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న జిల్లా విద్యా శిక్షణ సంస్థ వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి

కశింకోట: విద్యార్థులు జీవన నైపుణ్యాలు పెంపొందించుకుని విజయం సాధించడానికి కృషి చేయాలని జిల్లా విద్యా శిక్షణ సంస్థ వైస్ ప్రిన్సిపాల్, కోర్సు సహాయ కో-ఆర్డినేటర్ గొట్టేటి రవి తెలిపారు. మేజిక్ బస్సు సంస్థ సహకారంతో కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూలులో జిల్లాలోని 50 ప్రభుత్వోన్నత పాఠశాలలకు చెందిన వంద మంది వ్యాయామ, ఇతర ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు రానున్న మూడేళ్లలో అధునాతన జీవన నైపుణ్యాలు సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం మేజిక్ బస్సు సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఒక విద్యా సంవత్సరంలో 28 కృత్యాలను విద్యార్థుల ఆలోచనా విధానం, సామాజిక సహకారం, సమస్యా సాధన, స్వయం క్రమశిక్షణ అభివృద్ధి చెందే విధంగా బోధన సాగించాలన్నారు. స్కూలు ప్రిన్సిపాల్ రూప మాట్లాడుతూ ఆటల ద్వారా విద్యార్థుల్లో మంచి లక్షణాలు అలవర్చి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



పాయకరావుపేట: పట్టణంలో నాగరాజుపేట రైల్వే గేటు సమీపాన రైలు నుండి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడని తుని రైల్వే పోలీసు ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సోమవారం ఉదయం గౌహతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రమాదవశాత్తూ 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి జారిపడి మృతి చెందినట్టు తెలిపారు. మృతుని వద్ద లభించిన ప్రయాణపు టిక్కెట్టు ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చేరువలో ఉన్నత విద్య..!

- ప్రతీ మండలంలో రెండు జూనియర్ కాలేజీలు
- ఇందులో ఒకటి బాలికలకు ప్రత్యేకం
- ఆ దిశగానే గత ఏడాది ఉమ్మడి విశాఖలో 10 ప్లస్ టూ స్కూల్స్ ఏర్పాటు
- తాజాగా కో - ఎడ్యుకేషన్ కాలేజీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- విశాఖకు 1, అనకాపల్లికి 3, అల్లూరి జిల్లాకు 2 మంజూరు



ప్లస్ - 2 స్కూల్లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థినులు

విశాఖ విద్య: పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతీ మండలంలో రెండు జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేస్తోంది. ఇందులో ఒకటి బాలికల కోసం కేటాయించనున్నారు. బాలికా విద్యను ప్రోత్సహించాలనే తలంపుతో గతేడాది ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఇంటర్మీడియట్ కోర్సుల నిర్వహణకు 10 ప్లస్ టూ స్కూల్స్ (విశాఖపట్నంలో 6, అనకాపల్లి జిల్లాలో 4)ను ప్రారంభించారు. తాజాగా అవసరమైన మండలాల్లో కో - ఎడ్యుకేషన్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఉమ్మడి విశాఖలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏటా 50 వేల మందికి పైగా విద్యార్థులు ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరుతారు. విశాఖపట్నం జిల్లాలో 185 జూనియర్ కాలేజీలు ఉండగా, ఇందులో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 25 అందుబాటులో ఉన్నాయి. అనకాపల్లిలో 136 కాలేజీల్లో 60, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 39లో 27 ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్నారు.

పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం

కొత్తగా జూనియర్ కాలేజీ మంజూరు కోసం గతంలో ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. అందుబాటులో కాలేజీలు లేక, గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది విద్యార్థినులు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితులు ఉండేవి. దీన్ని గుర్తించిన దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒకేసారి ఏకంగా 34 కస్తూర్బా గాంధీ విద్యాలయాలను మంజూరు చేశారు. ఆ తర్వాత వచ్చిన పాలకులెవ్వరూ కొత్త కాలేజీల మంజూరుకు శ్రద్ధ తీసుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్త కాలేజీల ఊసే లేకపోగా, ఉత్తరాంధ్ర జిల్లాకు కూడలిగా ఉన్న విశాఖపట్నం కేంద్రంగా కొంతమంది కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేలా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జూనియర్ కాలేజీలను నిర్వీర్యం చేశారు.

ప్రతీ మండలంలో రెండు కాలేజీలు

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు జూనియర్ కాలేజీలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఒకటి బాలికల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తూనే, మరొకటి కో - ఎడ్యుకేషన్ కాలేజీగా ఉండేలా ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవసరమైన మండలాల్లో అదనపు కాలేజీల ఏర్పాటుకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్తగా 6 కో ఎడ్యుకేషన్ కాలేజీలు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కొత్తగా ఆరు కో - ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీలు మంజూరయ్యాయి. విశాఖపట్నం జిల్లా పద్మనాభం, అనకాపల్లి జిల్లాలో అచ్యుతాపురం, నాతవరం, ఎస్.రాయవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొయ్యూరు, పెదబయలు మండలాల్లో కో - ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీలు మంజూరు చేశారు. ప్లస్ - 2 స్కూల్స్‌గా గుర్తించే వీటిని పాఠశాలల్లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయా మండలాల్లో పదో తరగతి అనంతరం ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు సౌలభ్యంగా ఉండే పాఠశాలలను గుర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు



ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు జూనియర్ కాలేజీలు ఉండాలనేది ప్రస్తుత ప్రభుత్వం ఉద్దేశం. ఇది చాలా మంచి నిర్ణయం. డ్రాపవుట్ల నివారణకు దోహదపడుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువుల వైపు వస్తారు.

– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

క్లుప్తంగా

'జగనన్న సురక్ష' నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక 3, 4 సచివాలయాల పరిధిలోని ఏఎంసీ కాలనీలో మంగళవారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జీవీఎంసీ ఏపీడీ వి.కె.దొర సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 82వ వార్డు పరిధిలో జగనన్న సురక్ష యాప్‌లో వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

సీహెచ్ఎన్ అగ్రహారంలో 'గడప గడపకు' రేపు

అనకాపల్లిటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారంలో ఈ నెల 19న సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రభుత్వశాఖల అధికారుల, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

ఎస్టీ ధ్రువపత్రాలకు వినతి



సచివాలయ కన్వీనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కోటంశెట్టి అప్పారావు

అనకాపల్లిటౌన్: మండలంలోని మారేడు పూడి పూసలకాలనీలో సుమారు 40 ఏళ్లుగా నివసిస్తున్న 40 కుటుంబాలకు షెడ్యూల్ తెగలు(ఎస్టీ) కుల ధ్రువీకరణ పత్రం అందించాలని కోరుతూ బీజేపీ, జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందించారు. 40 కుంటుంబాల్లో ఒక కుటుంబానికి మాత్రమే ఎస్టీ ధ్రువపత్రం ఉందని, మిగిలిన 39 కుటుంబాలకు కూడా ఎస్టీ ధ్రువ పత్రాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శి పీత నానాజీ, కో కన్వీనర్ కోటంశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా కిలో రూ.140కి అమ్మకాలు జరిగాయి. ఎప్పటిలాగే ఉల్లిపాయ కిలో రూ.25, బంగాళాదుంప, వంకాయ రూ.30, బెండకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్, బీరకాయ రూ.60, చేమదుంప రూ.80, క్యాప్సికం రూ.100, అల్లం, పచ్చిమిరప రూ.200కు అమ్మకాలు సాగాయి. సాయంత్రం జల్లులుగా వర్షం కురవడంతో బేరాలు లేక దుకాణాలు వెలవెలబోయాయి.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 108 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	4,020	4,020
మూడోరకం	3,600	3,900

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-1
ఆదిపురుష్	: సత్యనారాయణ స్క్రీన్-2
రంగబలి	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
నాయకుడు	: వెంకటేశ్వర
భాగ్‌సాలే	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-25 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం మంది 418 గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'

చిరు వ్యాపారులకు ఆసరాగా నిలవాలి. రుణాల కోసం వారు వడ్డీ వ్యాపారుల అత్యాశకు బలికాకూడదు. ఇదే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకానికి శ్రీకారం చుట్టారు. చేతివృత్తులు, చిరు వ్యాపారాలపై ఆధారపడే కుటుంబాల్లో వెలుగులు నింపారు. ప్రతి ఆరు మాసాలకు రూ.10 వేలు చొప్పున వడ్డీ లేని రుణాలందిస్తూ వారికి తోడుగా నిలుస్తున్నారు.

చాలా సంతోషంగా వుంది



నా పేరు మళ్ల శివలక్ష్మి. మాది గొలగాం. నేను టైలరింగ్ చేస్తూ జీవనోపాధి పొందుతున్నాను. జగనన్న తోడు కార్యక్రమంలో భాగంగా సీఎం జగన్ చేస్తున్న సాయం వెలకట్టలేనిది. అన్‌సీజన్లో ఆర్థిక ఇబ్బందులతో అప్పుల కోసం వెతుక్కునేవాళ్లం. ఇపుడా దుస్థితి లేదు. జగనన్న తోడులో వస్తున్న రూ.10 వేలతో ఆర్థిక భరోసాను మించి, ఆత్మస్థైర్యం కలిగింది. మా మద్దతు జగనన్నకే.

వడ్డీ లేకుండా రుణం



శంకరం మా ఊరు. నా పేరు ఈశ్వరమ్మ. నేను గాజుల షాపు నడుపుతున్నాను. ఊర్లో ఎక్కడైనా రూ.10 వేలు అప్పు చేస్తే వడ్డీ చాలా ఎక్కువ. అసలు వడ్డీ తీరాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. అలాంటిది మాలాంటి చిరు వ్యాపారుల దుస్థితిని గమనించి ఒక అన్నగా జగనన్న తోడు పథకంతో మాకు అండగా నిలబడటం చాలా ఆనందంగా వుంది. మళ్లీ మళ్లీ సీఎంగా జగనే రావాలని కోరుకుంటున్నాం.

అప్పు పుట్టడమే కష్టం



మాది మారేడుపూడి. నా పేరు జ్యోతికౌర్. మా కుటుంబం ఇనుప పనిముట్లు తయారు చేసి, విక్రయిస్తుంది. అదే మాకు జీవనోపాధి. మాకు అప్పు ఇచ్చే వారే లేరు. అప్పులకు వడ్డీ కూడా కట్టలేని పరిస్థితి. ఇలాంటి మాకు జగనన్న తోడు పథకం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 వేలు వడ్డీలేని రుణం ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. కష్టకాలంలో ఒక అన్నలా ఆదుకుంటున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

- నేడు లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.1.58 కోట్లు
- అనకాపల్లి, కశింకోట మండలాల్లో 1468 మందికి లబ్ధి

అనకాపల్లి రూరల్ : 'జగనన్న తోడు'ఏడో విడత వడ్డీలేని రుణాలను మంగళవారం అందించనున్నారు. చిరు వ్యాపారులు, చేతి వృత్తులను జీవనాధారంగా బ్రతికే వారిని ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఇప్పటి వరకు ఆరు విడతలుగా చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణం రూ.10 వేలు చొప్పున అందించారు. ఇపుడు ఏడో విడత పంపిణీకి డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు.

జగనన్న తోడుకు అర్హులు వీరే

ఈ పథకంలో హస్తకళాకారులు, కమ్మరి, కుమ్మరి, మగ్గం పనివారు, రోడ్డు పక్కన, వీధుల్లో, బహిరంగ ప్రదేశాల్లో, ఫుట్‌పాత్‌లు, ఇతర ప్రైవేటు స్థలాల్లో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే వారు, తల, భుజాలపై, తట్టలతో సరకులు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకునేవారు, తోపుడు బళ్ల వ్యాపారులు, ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి సైకిళ్లు, మోటారు బైకులపై సరుకులు తీసుకెళ్తూ అమ్ముకునేవారు అర్హులు.



తోపుడు బండిపై జామ కాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారి

గ్రామాలు, పట్టణాల్లో 5 అడుగుల పొడవు, వెడల్పుతో తాత్కాలిక/శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు, రోడ్డు పక్కన చికెన్ సెంటర్ నిర్వాహకులనూ అర్హులుగా గుర్తించారు. అర్హులైన వారు సచివాలయంలో తమ పేర్లను నమోదు చేసుకుంటే ఆరు మాసాలకోసారి రూ.10 వేలు చొప్పున సున్నా వడ్డీకే ప్రభుత్వం రుణాలు అందిస్తుంది. వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుంది.

1468 మందికి లబ్ధి

జగనన్న తోడు పథకానికి సంబంధించి అనకాపల్లి గ్రామీణంలో 851 మంది, కశింకోట మండలంలో 617 మందిని అర్హులుగా గుర్తించారు. మొత్తం 1468 మందికి మంగళవారం రూ.10వేలు చొప్పున రూ.1.58 కోట్లు ఖాతాల్లో జమకానుంది. గతంలో రూ.10 వేలు చొప్పున రుణాలు తీసుకుని వాయిదాలు చెల్లించిన 495 మంది వ్యాపారులకు వడ్డీ మొత్తం రూ.1.17 లక్షలు మంజూరైంది. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమంలో లబ్ధిదారులకు మెగా చెక్‌ను అధికారులు అందజేయనున్నారు.

నేడు ఖాతాల్లోకి నగదు



అర్హులుగా నిర్ధారించిన జగనన్న తోడు లబ్ధిదారుల ఖాతాల్లో ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిన రుణం మంగళవారం జమకానుంది. రుణంతో పాటు గతంలో తీసుకున్న రుణ మొత్తానికి వడ్డీ రీయంబర్స్‌మెంట్ కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. చిరు వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలి. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశాం.

– కె.నీలాచలం, ఏపీఎం, డీఆర్‌డీఏ, అనకాపల్లి

జగనన్న సురక్షతో సంక్షేమ రక్ష

- ధ్రువపత్రాల పంపిణీలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



జగనన్న సురక్షలో లబ్ధిదారునికి ధ్రువపత్రాన్ని అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: గత ప్రభుత్వం అభివృద్ధిని, సంక్షేమాన్ని విస్మరిస్తే.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమం విస్తృత స్థాయిలో అమలవుతున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు అత్యవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను కేవలం రెండు రోజుల్లో పైసా ఖర్చు, శ్రమ లేకుండా అందిస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వాల్లో ప్రతి ధ్రువపత్రానికి నగదు చెల్లించడంతోపాటు, కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. జగనన్న పాలనలో ప్రజలకు ఎలాంటి శ్రమ లేకుండా సంక్షేమ ఫలాల్ని అందిస్తున్నామన్నారు. గ్రామంలో కమ్యూనిటీహాలు, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించినట్లు తెలిపారు. 195 మందికి జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలందించామన్నారు. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే మూడు మాసాల్లో గృహాలు మంజూరు చేస్తామన్నారు. గ్రామంలో బెల్ట్‌షాపులు తొలగించాలని చాలామంది మహిళలు తమదృష్టికి తీసుకువచ్చారని, త్వరలోనే తొలగిస్తామన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఇంతగా తపించే సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 70 శాతానికి పైగా ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించామని, ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గాన్ని దశల వారీగా అభివృద్ధి చేసినట్టు తెలిపారు. అనంతరం మంత్రి అమర్‌నాథ్ దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలను అందించారు. గోపాలపురంలో 616 గృహాల్లో గృహసారథులు, వలంటీర్లు సర్వేలు నిర్వహించి వివిధ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 440 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, ఎంపీడీవో కె.వి.నరసింహారావు, ఆర్ఐ రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారిపిన్ని ప్రసాద్, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, జగనన్న సురక్ష లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



తేగాడలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు



వెదురుపర్తిలో ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని తేగాడ, వెదురుపర్తి సచివాలయాల్లో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. తేగాడలో 736 మందికి, వెదురుపర్తిలో 560 మందికి మొత్తం 1296 మందికి వివిధ ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 11 అంశాలకు సంబంధించిన ధ్రువపత్రాలను కార్యక్రమంలో త్వరితగతిన ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని కొనియాడారు. దీన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఉప తహసీల్దార్ సురేష్‌కుమార్, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, నీటిపల్లి ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ వజ్రం శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు నీటిపల్లి దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం.. మౌలిక సదుపాయాల కల్పన



నీకు పింఛన్ ఎవరిస్తున్నారు.. అని అవ్వను అడుగుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అదే
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, తన దృష్టికి వచ్చిన సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును ఆరా తీస్తూ, స్థానిక సమస్యల్ని తెలుసుకుని వాటి పరిష్కారానికి అక్కడే ఉన్న అధికారులకు ఆదేశాలిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోడ్డు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నిధులను విడుదల చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో అనేక సమస్యలు ఏళ్ల తరబడి తిష్టవేసి ఉన్నా అప్పటి నాయకులు వాటి పరిష్కారానికి చొరవ చూపలేదని ఆక్షేపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. సచివాలయంతో పాటు, మరిన్ని వ్యవస్థలను ప్రజల ముంగిటకు తీసుకువచ్చారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపుతున్నట్టు పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, గ్రామ సర్పంచ్ కొల్లిమళ్ల గోవిందరావు, ఎంపీటీసీ కోరుకొండ అచ్చియ్యమ్మ, సచివాలయం కన్వీనర్ బంటు శ్రీనివాసరావు, కొల్లిమళ్ల నాగఅప్పలరాజు, ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, వెస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బైక్ దొంగలపై చర్యలు తీసుకోండి



ఎస్ఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నేతలు

అనకాపల్లిటౌన్: మోటార్ బైక్ దొంగతనాలకు అడ్డుకట్టు వేయాలని, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు స్థానిక పట్టణ ఎస్ఐ ఎస్.సత్యనారాయణకు సోమవారం వినతిపత్రం అందించారు. రికార్డులు లేకుండా కొంత మంది వ్యక్తులు బైక్‌లు కొనుగోలు చేయడం జరుగుతుందని, పాత వాహనాల కొనుగోలు దుకాణాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా సవరణలు



బీఎల్వోలతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: ఓటర్ల జాబితాను పక్కాగా తయారు చేయడంలో ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక గాంధీనగరం జీవీఎంసీ కల్యాణమండపంలో సోమవారం బీఎల్వోల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వివిధ ప్రాంతాల్లో నివసించే వ్యక్తుల పేర్లు, మరణించిన వ్యక్తులు, చిరునామా మార్పులు, చేర్పులు వంటివి ప్రతి ఇంటికి వెళ్లి, పరిశీలించి పక్కాగా రూపొందించాలన్నారు. ఆగస్టు 21లోపు ఓటరు జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి

అనకాపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన ఎండీఎం కార్మికుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం పెద్ద మనసుతో పరిష్కరించాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 31న కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాకు హాజరై, విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఎండీఎం కార్మికులపై పని భారం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న, అమ్మాజీ, ఉమ, శ్రీదేవి, లక్ష్మి, షేక్ బీబీ, సత్యవేణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత



రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న దృశ్యం

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం వద్ద గుంతలు పడిన రోడ్డుకు సర్పంచ్ సిరపరపు శివ తన సొంత ఖర్చుతో సోమవారం మరమ్మతులు చేయించారు. మండలంలోని తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వెళ్లే ఆర్ అండ్ బీ రోడ్డుకు మార్గమధ్యలో కన్నూరుపాలెం వద్ద గుంతలు పడి రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు ప్రోత్సాహంతో శివ మరమ్మతులు జరిపించారు. ఎంపీటీసీ సభ్యురాలు కన్నూరు అచ్చియమ్మ సహాయం అందించారు. శివ సేవా భావాన్ని స్థానికులు అభినందించారు.

విత్తన శుద్ధితో తెగుళ్ల ఉధృతికి చెక్



బోదువలసలో బీజామృతం తయారు చేస్తున్న రైతులు

సబ్బవరం: విత్తన శుద్ధి ద్వారా ప్రకృతి వ్యవసాయంలో తెలుగుళ్ల ఉధృతిని నియంత్రించవచ్చని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి జి. సోమలత తెలిపారు. మండలంలోని బోదువలసలో బీజామృతం తయారీ విధానాలపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. 20 మంది రైతులతో కలిసి బీజామృతం తయారు చేశారు. ఎకరా ప్రకృతి వ్యవసాయం సాగుకు 20 లీటర్ల నీరు, 5 కిలోల దేశీయ ఆవు పేడ, 5 లీటర్ల దేశీయ ఆవు మూత్రం, 50 గ్రాముల సున్నం అవసరమన్నారు. 5 కిలోల పేడను 20 లీటర్ల నీటిలో మూట కట్టి దించాలని, ఆ నీటిలో 5 లీటర్ల దేశీయ ఆవు మూత్రాన్ని వేస్తే 12 గంటల తర్వాత బీజామృతం తయారవుతుందన్నారు. ఇలా తయారైన బీజామృతంతో విత్తనాలను శుద్ధి చేస్తే భూమి నుంచి సంక్రమించే వ్యాధులు, తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చన్నారు. మొలకల శాతం బాగా వస్తుందన్నారు. కార్యక్రమంలో బోదు వలస మాజీ సర్పంచ్ కోన సంజీవరావు, రైతులు కోన అప్పలనాయుడు, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు బోకం గౌరీ, ద్వారపురెడ్డి రమణి పాల్గొన్నారు.

వలంటీర్లకు అభినందన సత్కారం



సత్కారం పొందిన వలంటీర్లతో కార్పొరేటర్ నీలిమ

అనకాపల్లిటౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను తంచనుగా ప్రజలకు అందించేందుకే వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ అన్నారు. 80వ వార్డు గవరపాలెం శాంతినగర్ 21వ సచివాలయంలో సోమవారం ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు ఉగాది పురస్కారాలందించారు. జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన పేదవాళ్లందరికీ సంక్షేమ పథకాలను వలంటీర్లు సేవాభావంతో అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గృహసారథులు పీలా రాజేష్, విల్లూరి నారాయణ, మళ్ల ప్రకాష్, రాజమండ్రి అప్పలస్వామి, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అవశ్యం



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు

పరవాడ: గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా గ్రామ సంఘాలకు ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు సోమవారం మొక్కలు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో 45 గ్రామ సంఘాల సభ్యులకు 10 రకాల పండ్ల మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, చుక్క రాము నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతకాపల్లిలో జగనన్న సురక్ష సర్వే

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమ గ్రామ సభ మండలంలోని అంతకాపల్లి గ్రామంలో ఈ నెల 24న నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలో సురక్ష సర్వేను సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి సోమవారం ప్రారంభించారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన సేవల వివరాలు సేకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు, వైస్ సర్పంచ్ గొర్లి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రవి, సచివాలయ కన్వీనర్ గొర్లి ఎర్రినాయుడు, వార్డు మెంబర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.